క్లుప్తంగా

కాలి నడకన తిరుమల యాత్ర



కాలి నడకన కొవ్వూరు చేరుకున్న దూసర్లపూడి రమణరాజు, గోవిందస్వామి

కొవ్వూరు: కాకినాడ నగరానికి చెందిన స్వయంభూ భోగి గణపతి పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు, గోవిందస్వామి అనే ఇరువురు కాలినడకన తిరుమల యాత్రకు బయల్దేరారు. శనివారం నాలుగో రోజు వారిద్దరూ కొవ్వూరు చేరుకున్నారు. తలపై ఇరుముడులు కట్టుకుని యాత్ర సాగిస్తున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నపుడు రోడ్డు సమీపంలోని పొలాల్లో సేదతీరుతున్నామన్నారు. పాదయాత్ర రాత్రి సమయాల్లోనే సాగిస్తున్నట్లు రమణరాజు తెలిపారు. తిరుమల వెళ్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని తిరిగి కాలినడకనే కాకినాడ చేరుకుంటామన్నారు. భోగి మంటల్లో వెలసిన గణపతి విగ్రహానికి కాంస్య కవచం చేయించే నిమిత్తం 108 రోజుల పాటు గోవిందమాల ధరించి పాదయాత్ర చేస్తున్నట్లు రమణరాజు వివరించారు. ఏలూరు మీదుగా మంగళవారానికి విజయవాడ చేరుకుంటామన్నారు.

దేవరపల్లి ఎంపీడీవోగా కృష్ణంరాజు



దేవరపల్లి: దేవరపల్లి ఎంపీడీవోగా డీబీఆర్ కృష్ణంరాజు శనివారం ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేసిన ఈవోపీఆర్‌డీ కె. ఉమామహేశ్వరశర్మ చాగల్లు మండల పరిషత్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన కృష్ణంరాజు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావులను మర్యాద పూర్వకంగా కలిశారు.

చినకాశి రేవులో అభివృద్ధి పనులకు శ్రీకారం

నిడదవోలు: ఆధ్యాత్మికత ఉట్టిపడే పట్టణంలోని చినకాశి రేవులో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే పనులు చేపడుతున్నట్టు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ చెప్పారు. దేవతామూర్తులు కొలివైన చినకాశి రేవులో పాడైన రెండు కాలువ రేవుల మరమ్మతు పనులకు శనివారం ఆయన శ్రీకారం చుట్టారు. ఈ పనుల కోసం మున్సిపల్ సాధారణ నిధులు రూ.2 లక్షలు కేటాయించారు. కాలువ రేవుల్లో పేరుకుపోయిన మట్టిని జేసీబీతో తొలగిస్తున్నారు. ఇక్కడ ముమ్మరంగా వ్యర్థాల తొలగింపు, పారిశుధ్య పనులు చేపడుతున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, కౌన్సిలర్ కొత్తపల్లి సుప్రియ, మున్సిపల్ ఏఈ వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చినకాశి రేవులో పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

పంట చేనుకు పండగొచ్చింది



పెండ్యాల గ్రామంలో రైతులకు వరికోత యంత్రాన్ని సబ్సిడీపై అందిస్తున్న నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు (ఫైల్)

- అన్నదాతకు వెన్నుదన్నుగా జగన్ ప్రభుత్వం
- ఆర్బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు
- పశ్చిమ డెల్టా నుంచి పుష్కలంగా నీరు
- ఖరీఫ్, రబీ సీజన్లలో విస్తారంగా సాగు
- పెరిగిన పంట దిగుబడులు
- మద్దతు ధరకు ధాన్యం సేకరణ

మండలంలో నాలుగేళ్లుగా రైతులకు అందిన లబ్ధి

వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా	రూ. 37.09 కోట్లు
వైఎస్సార్ సున్నా వడ్డీ సాయం	రూ. 1.08 కోట్లు
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	రూ.25.90 కోట్లు
పంట నష్టపరిహారం	రూ. 7.42 కోట్లు
యంత్రసేవా పథకం ద్వారా 56 మంది రైతులకు	రూ. 1.71 కోట్లు
22 ఆర్బీకేల నిర్మాణానికి చేసిన ఖర్చు	రూ. 4.79 కోట్లు



సింగవరం రైతుభరోసా కేంద్రం

నిడదవోలు రూరల్: రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వ్యవసాయ రంగాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలు చేస్తూ రైతులకు వెన్నుదన్నుగా నిలిచింది. గ్రామస్థాయిలో రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి రైతు వద్దకే సేవలను చేరుస్తోంది. పంటలు వేసేందుకు అవసరమైన పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వమే సమకూరుస్తోంది. అంతేకాకుండా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించి సాగుపై అన్నదాతలకు భరోసా కల్పిస్తోంది. రైతు ఉత్పత్తులకు ప్రభుత్వం మద్దతు ధర లభించేలా ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తోంది. నాలుగేళ్లుగా ప్రకృతి కూడా అనుకూలించడంతో ప్రతి రైతు పొలంలో వ్యవసాయం పండుగలా సాగవుతోంది.

గత పాలనలో కష్టాల కడలిలో..

నిడదవోలు మండలం వ్యవసాయానికి ప్రసిద్ధి. గత టీడీపీ ప్రభుత్వ హయంలో వ్యవసాయం పట్ల పూర్తిగా వివక్ష సాగింది. రుణమాఫీ మొదలు.. ధాన్యానికి మద్దతు ధర.. కొనుగోళ్ల వరకూ అన్నింటా అన్నదాతలను ప్రభుత్వం మోసగించింది. మిల్లర్లతో మిలాఖత్ అయి మొక్కుబడిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నడ్డి విరిచింది. కౌలు రైతులకు సాయం అందకపోవడంతో పంటలు నష్టపోయిన అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి ఉండేది.

ఆర్బీకేల ద్వారా రైతుల చెంతకే సేవలు

వ్యవసాయంలో విత్తు నుంచి పంట విక్రయం వరకూ రైతన్నలకు అన్ని విధాలుగా తోడ్పాటు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అద్భుత వ్యవస్థ రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు). ఈ ఆర్బీకేల ద్వారా ప్రతి గ్రామంలో రైతుల చెంతకే సేవలు అందిస్తున్నారు. నిడదవోలు మండలంలో 22 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 9,780 రైతు కుటుంబాలు ఉన్నాయి. 17,500 మంది రైతులు 22,470 ఎకరాల్లో ప్రధానంగా వరితో పాటు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఆర్బీకేల్లోనే డిజిటల్ కియోస్కల ద్వారా సర్టిఫై చేసిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను బుక్ చేసుకున్న గంటల్లోనే రైతుల ముంగిట అందిస్తున్నారు. ఆర్బీకేలకు అనుబంధంగా యంత్ర సేవా కేంద్రాలు, నియోజకవర్గ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్ ఏర్పాటు చేశారు. ప్రతి ఎకరాలో సాగయ్యే పంటల వివరాలను ఈ–క్రాప్ ద్వారా నమోదు చేయడం, ఈ డేటా ఆధారంగా పైసా భారం పడకుండా పంటల బీమా, పెట్టుబడి రాయితీ, సున్నా వడ్డీ, పంట రుణాలు వంటి సంక్షేమ ఫలాలు రైతులకు అందిస్తున్నారు. ఏటా జూన్ మొదటి వారంలోనే పశ్చిమ డెల్టా కాలువలతో పాటు పెండ్యాల పంపింగ్ స్కీమ్ ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. రైతులకు పగటి పూటే నాణ్యమైన 9 గంటల ఉచిత విద్యుత్తు సరఫరా చేయడంతో పాటు వైఎస్సార్ జలకళ ద్వారా సన్న, చిన్నకారు రైతులకు ఉచితంగా బోర్లు వేస్తున్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం కోసం 56 మంది రైతులు 12 గ్రూపులుగా ఏర్పడ్డారు. పెండ్యాల, డి.ముప్పవరంలలో రెండు వరికోత యంత్రాలతో పాటు వివిధ గ్రామాల రైతులకు ఏడు ట్రాక్టర్లు, 18 పవర్ టిల్లర్స్, 10 రోటోవేటర్స్, రెండు గడ్డిపోగుచేసే యంత్రాలను రాయితీపై అందజేశారు.

చరిత్రలో మొదటిసారిగా సాయం

నిడదవోలు మండలంలోని రావిమెట్ల, కంసాలిపాలెం, సింగవరం, తాళ్లపాలెం, తాడిమళ్ల, తిమ్మరాజుపాలెం గ్రామాల్లో ఎర్ర కాలువ ముంపుతో 2021లో రైతులందరూ తీవ్రంగా నష్టపోయారు. దీంతో చరిత్రలో మొదటిసారిగా నిడదవోలు మండలంలో 5,836 మంది రైతులకు రూ.18.26 కోట్ల పంటల బీమా సాయాన్ని అందించారు. గతేడాది ఆకాల వర్షాలకు, గోదావరి వరదల ఉధృతికి నష్టపోయిన రైతులకు రూ. 7.65 కోట్ల ప్రభుత్వ సాయం అందింది. ఈ ఏడాది వర్షాలకు రబీలో తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచింది.

ఆర్బీకేలతో రైతులకు మేలు



ఆర్బీకేలతో రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. ప్రభుత్వ సేవలపై రైతులకు విశ్వసనీయత పెరిగింది. ఈ క్రాప్ చేయడం ద్వారా పంటలు నష్టపోయిన రైతులకు సాయం అందుతోంది. నాణ్యమైన పురుగు మందులతో పాటు ఎరువులను కూడా విక్రయిస్తున్నారు. దళారుల ప్రమేయం లేకుండా రెండేళ్లుగా ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోళ్లు పూర్తిస్థాయిలో చేపట్టడంతో రైతులకు గిట్టుబాటు ధర అందుతోంది. ఎర్ర కాలువ ప్రభావంతో నష్టపోయిన రైతులకు సాయం పూర్తిగా అందించారు. –పోలిరెడ్డి శివరామకృష్ణ, రైతు, ఉనకరమిల్లి

కౌలు రైతులకు సకాలంలో సాయం



వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏటా కౌలు రైతులకు కూడా రూ.13,500 చొప్పున సాయం అందిస్తున్నారు. పెరిగిన సాగు ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ సాయం ఎంతో అండ అవుతోంది. రెండేళ్ల క్రితం వర్షాలకు పంట పూర్తిగా నష్టపోగా ఎకరానికి రూ.7,500 వరకు పరిహారం అందించారు. సీఎం జగన్ రైతులకు అండగా ఉంటున్నారు. –పసలపూడి రామకృష్ణ, సమిశ్రగూడెం, కౌలు రైతు

యంత్రాలతో ఎంతో ఉపయోగం



ప్రభుత్వం అందించే యంత్రాలతో వ్యవసాయ రంగానికి మరింత మేలు జరుగుతోంది. ఖరీదైన యంత్రాలు కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత సన్న,చిన్నకారు రైతులకు ఉండదు. జేఎల్‌జీ గ్రూపులుగా ఏర్పడడంతో మాకు వరికోత యంత్రాన్ని ప్రభుత్వం రాయితీపై అందించింది. వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా ప్రభుత్వం నుంచి రాయితీపై అర్హులైన రైతులు యంత్రాలు పొందవచ్చు. – మేడిమూడి సత్యనారాయణ, రైతు, పెండ్యాల





ఆసుపత్రులకు వెళ్లి పింఛన్ల అందజేత



ఏలూరు ఆసుపత్రికి వెళ్లి వృద్ధురాలికి పింఛను అందిస్తున్న వలంటీర్ పెనుమాక కుటుంబరావు



ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పొన్నపల్లి లక్ష్మణరావుకు పింఛను అందిస్తున్న వలంటీర్ లతశ్రీ

నల్లజర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా గ్రామ వలంటీర్లు పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. మండలంలోని శింగరాజుపాలెంకు చెందిన యంత్రపాటి దుర్గమ్మ తన కుమార్తెకు అస్వస్థతకు గురవడంతో ఆమెకు సహాయంగా ఏలూరు ఆసుపత్రిలో ఉంది. ఆ గ్రామ వలంటీర్ పెనుమాక కుటుంబరావు ఏలూరు వెళ్ళి కష్టంలో ఉన్న దుర్గమ్మకు పింఛను అందించారు. వలంటీర్ కుటుంబరావును శింగరాజుపాలకం ఎంపీటీసీ సభ్యుడు వామిశెట్టి పావనీకుమారి, గ్రామపెద్ద పరమేశ్వరరావు అభినందించారు. అలాగే అనంతపల్లికి చెందిన పొన్నపల్లి లక్ష్మణరావు ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.అతనికి ఆ గ్రామ వలంటీర్ లతశ్రీ శనివారం ఆసుపత్రికి వెళ్లి పింఛను అందించారు.

గోదావరికి మహా నీరాజనం



కొవ్వూరులో గోదావరి నదికి మహా నీరాజనం సమర్పిస్తున్న భక్తులు

కొవ్వూరు: జ్యేష్ఠ పూర్ణిమ సందర్భంగా శనివారం సాయంత్రం పట్టణంలోని గోష్పాద క్షేత్రంలో గోదావరి నదికి మహా నీరాజనం సమర్పించారు. గోదావరి నీరాజన సమితి ఆధ్వర్యంలో ముందుగా గోదావరి మాతకు విశేష పూజలు నిర్వహించారు. 212వ మాసోత్సవంలో భాగంగా గోదావరి నదికి వివిధ రకాల హారతులు సమర్పించారు. నీరాజన సమితి అధ్యక్షుడు కలిగోట్ల కృష్ణారావు, జ్యోతిష్య పండితుడు తుట్టగుట్ల భైరవ మూర్తి, పలువురు భక్తులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

క్షేమంగా స్వస్థలం చేరిన కొవ్వూరు వాసి

- ప్రమాదానికి గురైన ఆయన ఎక్కాల్సిన రైలు
- భువనేశ్వర్ నుంచి రాజమహేంద్రవరం వరకూ రిజర్వేషన్
- ఒడిశా రాజధానికి రాకుండానే ప్రమాదానికి గురైన రైలు



పాలెంపాటి అప్పారావు

కొవ్వూరు: భువనేశ్వర్‌లో తాను ఎక్కాల్సిన హౌరా- చెన్నై ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురై వందలాది మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని పట్టణానికి చెందిన పాలెంపాటి అప్పారావు వాపోయారు. అదే రైలులో తాను భువనేశ్వర్ నుంచి రాజమహేంద్రవరం రావాల్సి ఉందన్నారు. తాను ఎక్కాల్సిన రైలు ముందుగానే ప్రమాదానికి గురవడం తీవ్రంగా కలిచి వేసిందన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే ఒడిసాలోని బార్‌బిల్‌లో జగదీష్ స్టీల్ అండ్ పవర్ ప్లాంట్‌లో నేను పదమూడేళ్లుగా ఉద్యోగం చేస్తున్నాను. భువనేశ్వర్‌కు 325 కిలోమీటర్ల దూరంలో బార్‌బిల్ ఉంది. నేను బార్‌బిల్ నుంచి పూరీ ఎక్స్‌ప్రెస్‌లో భువనేశ్వర్ చేరుకున్నాను. హౌరా–చైన్నై ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురై విషయం తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాను. భువనేశ్వర్ నుంచి విజయనగరం వరకూ మరో లోకల్ రైల్లో వచ్చాను. విజయనగరం నుంచి విశాఖపట్నం అక్కడి నుంచి రాజమహేంద్రవరం బస్సులో వచ్చాను. చివరికి క్షేమంగా ఇంటికి చేరుకున్నాను.

సంక్షేమాన్ని వివరిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ..

గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



వృద్ధురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకుంటూ గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముందుకు సాగారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం ఆయన నల్లజర్ల గ్రామంలోని 12, 13 వార్డుల్లో నిర్వహించారు. అధికారులు, సిబ్బందితో కలసి ఎమ్మెల్యే తలారి ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటం ఉన్న బుక్‌లెట్లను అందించారు. కిందకు వేళ్లాడుతున్న విద్యుత్ వైర్లను సరి చేయించాలని, డ్రైనేజీలను ఆధునీకరించాలని, సీసీ రోడ్లు వేయాలని, రేషన్ కార్డులు, ఇళ్లు, ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని రెండు వార్డుల వారు ఈ సందర్భంగా కోరారు. త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి కలిగిన ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని పాలించడం ప్రజల అదృష్టమన్నారు. ఆయన పాలనపై అందరూ సంతోషంగా ఉన్నారని, ముఖ్యమంత్రిగా మళ్లీ ఆయననే చూడాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. అధికారంలో ఉన్నపుడు ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోని చంద్రబాబు ఎన్నికలు సమీపిస్తుండటంతో మరోసారి మోసం చేసేందుకు సిద్ధమవుతున్నారని విమర్శించారు. టీడీపీ నాయకులు చెప్పే మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో నల్లజర్ల సర్పంచ్ పల్లి జ్యోతి, ఉప సర్పంచ్ రాయుడు విజయకుమార్, వైస్ ఎంపీపీ ఆరుగొల్లు మణి, ఎంపీటీసీ సభ్యురాలు మేణ్ని వెంకటలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, నాయకులు వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, మద్దిపాటి ప్రసాద్,మేణ్ని యువరాజు, నీరుకొండ జయకృష్ణ, కండెపు రామకృష్ణ, కంకిపాటి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా రైలు ప్రమాద మృతులకు నివాళి



కొవ్వొత్తులు వెలిగించి సంతాపం తెలుపుతున్న సీపీఎం శ్రేణులు

నిడదవోలు: ఒడిశా రైలు ప్రమాద మృతులకు సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తులు వెలిగించి తీవ్ర సంతాపం తెలిపారు. పట్టణంలోని చర్చిపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కూడలిలో ఈ కార్యక్రమం జరిగింది. సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు, కె. గోపి, జి. శ్రీనివాసరావు, జి. ప్రసన్న, డి. రమేష్, టి.నాని, వి. ప్రభాకర్, ప్రసాద్, ఎల్లే పండు, దేవి, జి. శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో అన్నవరప్పాడు

పెరవలి: అన్నవరప్పాడు గ్రామం రెండు రోజులుగా అంధకారంలో ఉంది. భానుడు నిప్పుల వర్షం కురిపిస్తున్న తరుణంలో విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ఆ గ్రామ ప్రజలు విలవిలలాడుతున్నారు. శుక్రవారం తెల్లవారుజాము ఐదు గంటలకు గ్రామంలో సరఫరా నిలిపివేశారు. ఇదే సమయంలో 63 కేవీ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు మరో మూడు డబ్బాలు కాలిపోయాయి. ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ విషయాన్ని అ న్నవరప్పాడు గ్రామస్తులు శనివారం నిడదవో లు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ట్రాన్స్‌కో ఏఈ నిచ్చాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేయడంతో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు.

తూర్పుగోదావరి జిల్లా- నిడదవోలు మండలం తాడిమళ్ళ గ్రూప్ దేవస్థానం యొక్క భూములు కౌలుకు సేద్యం చేసుకొనుటకు బహిరంగ వేలం ప్రకటన

[illegible]

శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానం, సింగవరం గ్రామం, [illegible] ది. 13.06.2023 మధ్యాహ్నం గం.3.00లకు శ్రీ స్వామివారి ఆలయం వద్ద జరుగును.

వ.నెం.	గ్రామం	సర్వే నెం.	పల్లం/మెరక	విస్తీర్ణం	ప్రథమ ధరావత్తు
1.	సింగవరం	13/7	చేపల చెరువు	1-00	రూ. 10,000/-

శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానం, సింగవరం గ్రామం, ది. 13.06.2023 మధ్యాహ్నం గం.4.00లకు నుండి శ్రీ స్వామివారి ఆలయం వద్ద జరుగును.

వ.నెం.	గ్రామం	సర్వే నెం.	పల్లం/మెరక	విస్తీర్ణం	ప్రథమ ధరావత్తు
1.	సింగవరం	229	పల్లం	3.12	రూ. 10,000/-
2.	సింగవరం	80/2	పల్లం	1.80	రూ. 5,000/-
3.	సింగవరం	106/6	పల్లం	0.81	రూ. 5,000/
4.	సింగవరం	82/2	పల్లం	0.84	రూ. 5,000/-
5.	సింగవరం	360/3	పల్లం	0.27	రూ. 5,000/-
6.	సింగవరం	85/2	పల్లం	1.81	రూ. 5,000/-

శ్రీ రామలింగేశ్వర స్వామివారి దేవస్థానం [illegible] గ్రామం ది.16.06.2023 [illegible] గం.9.30ల నుండి శ్రీ స్వామి వారి ఆలయం వద్ద జరుగును.

వ.నెం.	గ్రామం	సర్వే నెం.	పల్లం/మెరక	విస్తీర్ణం	ప్రథమ ధరావత్తు
1.	[illegible]	1245	మెరక	6.10	రూ. 10,000/
2.	[illegible]	1245	మెరక	6.38	రూ. 10,000/-
3.	[illegible]	1245	మెరక	6.38	రూ. 10,000/-
4.	తాడిమళ్ళ	713	మెరక	3.80	రూ. 5,000/
5.	తాడిమళ్ళ	128	మెరక	2.14	రూ. 5,000/-

శ్రీ రాజగోపాల స్వామివారి దేవస్థానం తాడిమళ్ళ గ్రామం ది.16.06.2023 [illegible] గం. 10.30ల నుండి శ్రీ స్వామివారి ఆలయం వద్ద జరుగును.

వ.నెం.	గ్రామం	సర్వే నెం.	పల్లం/మెరక	విస్తీర్ణం	ప్రథమ ధరావత్తు
1.	తాడిమళ్ళ	683	పల్లం	4.59	రూ. 10,000/-
2.	తాడిమళ్ళ	684	పల్లం	6.38	రూ. 10,000/
3.	తాడిమళ్ళ	685	పల్లం	5.38	రూ. 10,000/-
4.	తాడిమళ్ళ	182/1	పల్లం	0.80	రూ. 5,000/-

ఇట్లు : కార్యనిర్వహణాధికారి

పాఠశాల భవనాలకు శంకుస్థాపన



పల్లంట్ల జెడ్పీ హైస్కూల్ ఆవరణలో పాఠశాల భవనానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: మండలంలోని పల్లంట్ల, త్యాజంపూడి జెడ్పీ హైస్కూళ్ల ఆవరణల్లో నిర్మించే పాఠశాల భవనాలకు శనివారం గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు భూమిపూజ చేశారు. 'నాడు-నేడు' పథకంలో మంజూరైన రూ.72 లక్షల వ్యయంతో రెండు చోట్లా భవనాలు నిర్మిస్తున్నారు. పల్లంట్ల హైస్కూల్ ఆవరణలో రూ.36 లక్షల వ్యయంతో నిర్మించే మూడు తరగతి గదుల భవనానికి, త్యాజంపూడి హైస్కూల్ ఆవరణలో రూ.26 లక్షల వ్యయంతో నిర్మించే రెండు తరగతి గదుల భవనానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, సర్పంచులు నూతలపాటి వెంకటరమణ, కుసులూరి స్వరూపరాణి, ఉప సర్పంచ్ కుసులూరి వెంకట సతీష్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఎముకలు, కండరాలకు దృఢత్వం

చాగల్లు: సైక్లింగ్ ద్వారా కొన్ని వ్యాధులను నివారించడంతో పాటు ని యంత్రణలో ఉంచవచ్చని బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.నిశిత అన్నారు. ఆ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం సైకిల్ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నిశిత మాట్లాడుతూ ఎముకలు, కండరాల దృఢత్వాన్ని పెంచుకోవడానికి, అవయవాల కదిలికలు మెరుగు పరుచుకునేందుకు, శరీరంలో అధిక కొవ్వును తగ్గించుకునేందుకు రోజు సైకిల్ తొక్కాలన్నారు. బ్రాహ్మణగూడెంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో సీహెచ్ శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ పి.రేవతి, ఎం. రాజశేఖర్, డీవీ రామకృష్ణ, 104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు

చాగల్లు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు (పెట్టుబడులు, మౌలిక వసతులు) రాజీవ్‌కృష్ణ అన్నారు. మండలంలోని దారవరంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవిష్యత్తులో ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ప్రజలందరూ సీఎం జగన్‌కు అండగా ఉండాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకుడు వుండవల్లి వెంకటేశ్వరారవు తల్లి ఇటీవల మృతి చెందింది. ఆ కుటుంబ సభ్యులను రాజీవ్‌కృష్ణ పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ, సర్పంచ్ మద్దుకూరి రవి తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

తాళ్లపూడి: మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7న తాళ్లపూడిలోని కరిబండి సుబ్బారావు మోమెరియల్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. ఆ కళాశాల ప్రాంగణంలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం వరకూ ఈ జాబ్‌మేళా జరుగుతుంది. దీనికి సంబంధించిన గోడ పత్రికను శనివారం తాళ్లపూడిలో ఆవిష్కరించారు. మానవత సంస్థ గౌరవాధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు, కరిబండి విద్యా సంస్థల డైరెక్టర్ కరిబండి త్రినాథస్వామి, మానవత సంస్థ అధ్యక్షుడు జె. వెంకటేశ్వరరావు చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 21 ప్రముఖ కంపెనీల్లో భర్తీ కోసం 968 ఉద్యోగాలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు.

